

గాజులరామారం సర్వే నంబర్. 342లో కొనసాగుతున్న నిర్మాణాలు

పూర్తి నివేదిక ఇవ్వాల్సిందే..

- హెచ్ఎండీఏ స్థలం కబ్జాపై జిల్లా కలెక్టర్ ఆరా
- సాక్షి కథనానికి స్పందించి అధికారులకు ఆదేశం
- తూతూమంత్రంగా చేపట్టిన కూల్చివేతలపై స్థానికుల ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్..

కుత్బుల్లాపూర్: హెచ్ఎండీఏకు కేటాయించిన స్థలంలో ఏకంగా నెల రోజుల వ్యవధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం కలకలం రేపుతోంది. ఇదే విషయంపై శుక్రవారం 'సాక్షి'లో 'ప్రభుత్వ స్థలం.. 300 ఇళ్లతో బస్తీ నిర్మాణం'అనే కథనంపై మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆరా తీశారు. పూర్తి నివేదికను తయారు చేసి వెంటనే పంపించాలని కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్, ఆర్ఐ రజనీకాంత్‌ను ఆదేశించారు.

◆ కబ్జా చేస్తూ.. అమాయకులకు కట్టబెడుతూ..

పగలు రాత్రి తేడా లేకుండా ఇష్టానుసారంగా హెచ్ఎండీఏకు కేటాయించిన సదరు స్థలం నెల రోజుల క్రితం ఖాళీగా ఉండేది. ఈ క్రమంలో ఎన్నికలు రావడం కబ్జాదారులకు కలిసి వచ్చింది. కబ్జాకు కాదేది అనర్హం అన్న చందంగా.. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తూ అమాయకులకు కట్టబెట్టి సొమ్ము చేసుకోవడమే ఇక్కడ కబ్జాదారుల వంతుగా మారింది.

◆ పోలీసు కేసులకు భయపడకుండా...

కుత్బుల్లాపూర్ మండల కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న సర్వే నం.342 ప్రభుత్వ స్థలం గతంలో హెచ్ఎండీఏకు కేటాయించారు. చుట్టూ ప్రహరీ నిర్మాణం కూడా చేపట్టి పనిలో ఉండగా స్థానికంగా ఉండే ఓ కుల సంఘం పెద్ద అన్నీ తానై ఏకంగా నెల రోజుల వ్యవధిలోనే 300 నిర్మాణాలు చేపట్టడంపై అధికారుల పాత్ర ఉందని పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

◆ ఇక్కడ ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టే వారిని గుర్తించి మండల రెవెన్యూ అధికారి జగద్గిరిగుట్ట పోలీసులకు మల్లేష్, అబిద్, రాము, లక్ష్మి, శ్యామ్, మురళి, రమేష్ నాయక్, నరసింహ, అతని తమ్ముడు శీను, ఇబ్రహీం, బూర్గు రాజు, మజర్ ఖాన్, యాదగిరిలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా డోంట్ కేర్ అన్నట్లుగా కబ్జాల తతంగం కొనసాగిస్తూ వచ్చారు.

◆ ముఖ్యంగా మల్లేష్ అనే వ్యక్తి గడిచిన నెల రోజుల్లో రెచ్చిపోయాడని పుకార్లు షికార్లు చేస్తున్నాయి.. ఓ పోలీసు అధికారి తనకు అండగా ఉన్నాడని.. రెవెన్యూ అధికారులకు తాను ఎంత చెబితే అంతా అని... తనను ఎవరూ ఏమీ చేయలేరని తోటి కబ్జాదారులను బెదిరిస్తూ వారి వద్ద ప్లాట్లు తీసుకుని సొంతగా నలుగురిని నియమించుకొని అమాయకులకు ప్లాట్లు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారనేది ప్రధాన ఆరోపణ.

◆ అతడిపై మండల రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో గడిచిన నెల రోజుల్లో ఏకంగా 300 నిర్మాణాలు చేపట్టి రూ.కోట్లు సంపాదించాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కూల్చివేతలకు వెళ్లే అధికారులకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించేందుకు పది మంది హిజ్రాలకు ఓ నిర్మాణం చేపట్టి గిఫ్ట్‌గా ఇవ్వడం విశేషం.

ఒక్కో నిర్మాణానికి రూ.3లక్షలు వసూలు..

ఇంత జరుగుతున్నా కబ్జాలను అరికట్టాల్సిన రెవెన్యూ యంత్రాంగం అక్కడికి వెళ్లి వారితో బేరసారాలకు దిగి వెనుదిరిగి వెళ్లడం పరిపాటిగా మారింది. ఇక్కడ జరిగే ఒక్కో నిర్మాణానికి సుమారు రూ.3లక్షల చొప్పున వసూలు చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులపై ప్రధాన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు ఇటీవల జరిగిన సమీక్షలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉందని స్పష్టంగా ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేస్తాం

- హెచ్చరించిన రెవెన్యూ అధికారులు
- అక్రమ నిర్మాణాల కూల్చివేత

నిజాంపేట్: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలపై బాచుపల్లి మండల రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. నిజాంపేట్ సర్వేనెంబరు 191లో అక్రమ నిర్మాణాల విషయమై ఫిర్యాదులు అందుకున్న అధికారులు శుక్రవారం పలు నిర్మాణాలను గుర్తించి సిబ్బందితో కూల్చి వేయించారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



నిజాంపేట్ సర్వే నం.191లో నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఇక్కడ నామమాత్రంగా కూల్చివేతలు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా కూల్చివేతలు చేపట్టారు. కైసర్‌నగర్ ప్రధాన రహదారిని అనుకుని హనుమాన్ టెంపుల్ ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 342లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లారు. పదుల సంఖ్యలలో నిర్మాణాలు ఉండగా కేవలం 4గదులను సాక్షికంగా కూల్చివేసి చేతులు దులుపుకున్నారు. కబ్జాలపై రెవెన్యూ అధికారులు ఉత్తుత్తి కూల్చివేతలపై పలువురు ముక్కున వేలేసుకున్నారు.



సర్వే నం.342లో గదిని చేతులతో కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పార్కు, కమిటీహాల్ స్థలాలను పరిరక్షించాలి

సుబాష్‌నగర్: అక్రమణలకు గురైన పార్కు, కమిటీహాల్ భవన స్థలాలను పరిరక్షించాలని గ్రీన్‌హిల్స్ హౌసింగ్ కాలనీ ప్రెసిడెంట్ గద్ద శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కాలనీవాసులతో కలిసి ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుండిగల్ కమిషనర్, జిల్లా కలెక్టర్లను కలిసి ఆక్రమణల విషయంపై ఫిర్యాదు చేశామన్నారు. అయినా ఫలితం లేదన్నారు. చివరకు హెచ్ఆర్సీ, లోకాయుక్తా, రాష్ట్ర గవర్నర్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశామన్నారు. అక్రమార్కులు 1988 లేఅవుట్‌ను సృష్టించి పార్కు, కమిటీ భవనాలను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. ఈ స్థలాన్ని అధికారులు కాపాడాలని కోరారు.



ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు చేస్తున్న గ్రీన్‌హిల్స్ కాలనీ ప్రెసిడెంట్ గద్దం శ్రీనివాసులు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు

సుభాష్‌నగర్: మనిషి అవయవాల్లో కళ్లు అత్యంత ముఖ్యమని మెడివిజన్ కంటి ఆస్పత్రి కూకట్‌పల్లి బ్రాంచ్ మేనేజర్ చిరంజీవి అన్నారు. సూరారం కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం కూకట్‌పల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మీనాక్షి 150 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలతో బాధ పడుతున్న మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. మరో 12మంది విద్యార్థులకు చూపు మందగించడంతో వారికి ఖరీదైన కళ్లద్దాలు ఇవ్వనున్నట్లు చిరంజీవి తెలిపారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న మెడివిజన్ కంటి ఆస్పత్రి వైద్యురాలు మీనాక్షి

కార్యకర్తలకు అండగా ఉండాలి

కుత్బుల్లాపూర్: కార్యకర్తలకు అండగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారిస్తూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులు కేటీఆర్‌ను కలవగా పై విధంగా స్పందించినట్లు తెలిపారు. అధికారంలో లేకపోయినప్పటికీ ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు.



అసెంబ్లీలో కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్

22 నుంచి హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్-2023

మాదాపూర్: విద్య, జీవనశైలి, పోషకాహారం, అభిరుచులు నాలుగు కీలక విభాగాలలో ఉత్పత్తులు, సేవలతో ప్రదర్శన ఉంటుందని హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ టీజీ తెలిపారు. శుక్రవారం మాదాపూర్‌లోని హైటెక్స్ సెంటర్‌లో హైదరాబాద్ కిడ్స్ ఫెయిర్ 2023కి సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు హైటెక్స్‌లో ఫెయిర్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రదర్శనలో పిల్లల పరుగు, భారీసైజు జింగా, పిల్లల ఫ్యాషన్ షో, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్‌లు, ఫ్లూయిడ్ ఆర్ట్ కార్యక్రమాలను ఉంటాయన్నారు. కాంటినెంటల్ హాస్పిటల్ వైస్ ప్రెసిటెండ్ స్మితా చౌదరి, హోలీ జాలీ డైరెక్టర్ అఖిల భూపతిరాజు, లైఫ్‌స్పాన్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ వంశీకృష్ణ, హైదరాబాద్ రన్నర్స్ జనరల్ సెక్రటీ అరుణ్‌కుమార్, నటి ప్రజ్ఞ్యానయన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలి

నిఫ్ట్ హైదరాబాద్ డైరెక్టర్ అవినాష్ రాయ్‌పల్లి

రాయదుర్గం: కేంద్రీయ విద్యాలయం గచ్చిబౌలి వార్షిక క్రీడోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. శుక్రవారం జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక క్రీడోత్సవాలను నిఫ్ట్ హైదరాబాద్ డైరెక్టర్ అవినాష్ రాయ్‌పల్లి ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు క్రీడల పట్ల కూడా ఆసక్తి కనబర్చాలని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అంతకుముందు విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు.

60వ వ్యవస్థాపక దినోత్సవం

కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలిలో 60వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు పలు కార్యక్రమాలను నిర్వహించారు.

కుత్బుల్లాపూర్‌ను రాష్ట్రంలోనే ముందంజలో ఉంచుతా



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: అభివృద్ధి విషయంలో కుత్బుల్లాపూర్‌ను రాష్ట్రంలోనే ముందంజలో ఉంచుతామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. హ్యాట్రిక్ సాధించిన ఆయనను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతో తాను ఎమ్మెల్యేగా గెలుపొందానన్నారు. అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసేది లేదన్నారు.

◆ చింతల్ డివిజన్ శ్రీసాయికాలనీలోని సెయింట్ మార్టిన్స్ హై స్కూల్‌లో నిర్వహించిన 25వ వార్షికోత్సవ సెలెస్టియల్ క్రెసెండో కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఆర్టిస్ట్ పరోడి గురుస్వామిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర ఎనలేనిదన్నారు. వారి ఆశయాలను అనుగుణంగా విద్యార్థులు నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు రాజశేఖర్ యాదవ్, జైకిషన్‌యాదవ్, ప్రిన్సిపాల్ అనిత రావు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి నర్సింహారావు రాజీనామా

కుత్బుల్లాపూర్: బీజేపీ మేడ్చల్ జిల్లా కార్మిక విభాగం జాయింట్ కన్వీనర్ శరగడం నర్సింహారావు పదవితో పాటు పార్టీకి రాజీనామా చేశారు. ఆయన కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌తో కలిసి కొంతకాలంగా బీజేపీలో పనిచేస్తున్నారు. తన వ్యక్తిగత కారణాల వలన బీజేపీని వీడుతున్నట్లు ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తనకు పార్టీపై, నాయకులపై ఎలాంటి కోపతాపాలు లేవన్నారు. తాను వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని నిజాంపేట్ సెక్షన్ ఏఈ రాకేష్ ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్‌నగర్ కాలనీ ఫీడర్ పరిధిలోని 191 కాలనీ, ఎన్టీఆర్‌నగర్, శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. అదే విధంగా ప్రశాంత్‌హిల్స్ ఫీడర్ పరిధిలోని మధురానగర్, ప్రశాంత్‌హిల్స్ కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎన్‌సీఎల్ ఫీడర్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: ఎన్‌సీఎల్ ఫీడర్ పరిధిలోని కేపీఆర్ ఫంక్షన్‌హాల్ లేన్, విజయశాంతి ఎన్‌క్లేవ్, శివారెడ్డి గొడౌన్‌లు, ఎన్సీఎల్ నార్త్, ఎన్‌సీఎల్ స్విమ్మింగ్ పూల్స్, ప్రజెయ్ అపార్ట్‌మెంట్స్, మనభూమి ఎన్‌క్లేవ్, వెన్‌సాయి అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని కొంపల్లి సెక్షన్ ఏఈ తెలిపారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కుత్బుల్లాపూర్: మేడ్చల్ డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఈనెల 16న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగే వేదికలో ఎలక్ట్రిసిటీ కంజ్యూమర్ గ్రీవియెన్స్ రిడ్రెసల్ ఫోరంకు చెందిన నలుగురు సభ్యులు పాల్గొంటారని తెలిపారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

నిజాంపేట్: పిన్ టీవీ యూట్యూబ్ చానెల్ ఆధ్వర్యంలో షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ నిర్వహించనున్నారు. శుక్రవారం తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్‌తో కలిసి పిన్ టీవీ డైరెక్టర్ అనిల్‌రెడ్డి, ఆర్గనైజర్ మధుకర్‌లు కాంటెస్ట్‌కు సంబంధిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రేమలు-పెళ్లిళ్లు, లింగ వివక్షత, పర్యావరణం, ప్రజాస్వామ్యం-రాజకీయాలు, యువజనులు-సంస్కృతి, విద్య-వైద్యం, మూఢ నమ్మకాలు, సోషల్ అవేర్‌నెస్ అంశాలపై షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ ఉంటుందన్నారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతి, 6 నుంచి 15 స్థానాల్లో నిలిచిన వారికి ప్రశంస పత్రాలు, మెమొంటోలు అందజేస్తామన్నారు. తెలుగు మాధ్యంలో రూపొందించే షార్ట్‌ఫిల్మ్స్ నిడవి 30 నిముషాలు ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్ వేదికగా కాంటెస్ట్ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం.74165 00946లో సంప్రదించాలని కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతాని రామకృష్ణగౌడ్, అనిల్‌రెడ్డి, మధుకర్

పాదయాత్రగా శ్రీశైలం బయల్దేరిన శివస్వాములు



పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీలు శంభీపూర్‌రాజు, మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్, బండి సత్యనారాయణ గురుస్వాముల ఆధ్వర్యంలో 100 మంది శివస్వాములు శుక్రవారం శ్రీశైలంకు బయల్దేరారు. మల్లికార్జునస్వామి వారికి ఇరుముడి మొక్కులు అప్పగించడానికి వెళ్తున్న మహా పాదయాత్రను ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి ఏటా దాదాపు 10రోజుల పాటు కాలినడకన శ్రీశైలం పుణ్యక్షేత్రం చేరుకుని ఇరుముడి మొక్కులు చెల్లిస్తూ వస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, కొలుకుల జైహింద్, సత్తిరెడ్డి శ్రీనివాస్, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిల్లెట్ క్రిస్మస్ ట్రీ

గచ్చిబౌలి: మిల్లెట్స్‌తో క్రిస్మస్ ట్రీని రూపొందించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరాన్ని పురస్కరించుకొని మిల్లెట్స్‌తో తయారు చేసిన క్రిస్మస్ ట్రీని ఆవిష్కరించారు. ఏడు రకాలైన ఫాక్స్‌టైల్ మిల్లెట్, బార్న్‌యార్డ్ మిల్లెట్ , పెర్ల్ మిల్లెట్, జొన్న మిల్లెట్, లిటిల్ మిల్లెట్, కోడో మిల్లెట్, ఫింగర్ మిల్లెట్లను క్రిస్మస్ ట్రీ తయారీలో ఉపయోగించారు. పది అడుగుల ఎత్తు, రెండున్నర అడుగుల వెడల్పు, పది కిలోల బరువుతో తయారుచేశారు. చిరు ధాన్యాలపై అవగాహన, ప్రోత్సహించేందుకు క్రిస్మస్ ట్రీ ని రూపొందించినట్లు మంజీరా హోటల్స్ అండ్ రిసార్ట్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.వి.గణేష్ తెలిపారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

- టాస్కులు, కమిషన్ల పేరుతో మోసం

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.29 లక్షల 56 వేలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... అమీన్‌పూర్ మండల పరిధిలోని పిజెఆర్ ఎన్‌క్లేవ్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి పార్ట్‌టైం జాబ్ అంటూ డిసెంబర్ 12న తన వాట్సాప్‌కు తేదీన మెసేజ్ వచ్చింది.దీంతో ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు.దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు.కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్ లో చూపిస్తూ వచ్చారు.ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.29 లక్షల 56 వేలు చెల్లించాడు.సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతో పాటు కమిషన్ చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు.దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అమీన్‌పూర్ పరిధిలో..

అమీన్‌పూర్ పరిధిలోని ఐలాపూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి డిసెంబర్ 10వ తేదీన జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేస్తూ మొత్తం రూ.11 లక్షల 73 వేలు ఇన్వెస్ట్ చేశాడు. చివరికి తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి శుక్రవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ క్వార్టర్స్ నిర్మాణం ఎప్పుడు?

- భూత్ బంగ్లాలను తలపిస్తున్న భవనాలు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



భూత్ బంగ్లాను తలపిస్తున్న పోలీస్‌క్వార్టర్స్ భవనం



షాపూర్‌నగర్‌లోని పోలీస్ క్వార్టర్స్ భవనాలు

రంగారెడ్డినగర్: ఒకప్పుడు పోలీస్ కుటుంబాలు నివసించడానికి ఏర్పాటు చేసిన క్వార్టర్స్ నేడు భూత్ బంగ్లాలను తలపిస్తున్నాయి. షాపూర్‌నగర్ సర్కిల్ నుంచి గాజులరామారానికి వెళ్లే రోడ్డులో హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశాన్ని ఆనుకుని గతంలో పోలీసు కుటుంబాలు నివసించడానికి పదుల సంఖ్యలో క్వార్టర్స్‌ను నిర్మించారు. అయితే వాటి నిర్వహణ లోపించడంతో కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ విషయమై 'సాక్షి'లో పలు కథనాలు ప్రచురితం కాగా ఉన్నతాధికారులు వాటికి మరమ్మతుల చేపడతామని ప్రకటించినా అవి అమలుకు నోచుకోలేదు.

◆ ఇటీవల క్వార్టర్స్ సమీపంలో కొత్తగా బాలానగర్ డీసీపీ కార్యాలయాన్ని నిర్మించినా క్వార్టర్స్ విషయాన్ని గాలికొదిలేశారు. జీడిమెట్ల పీఎస్ పరిధిలో విధులు నిర్వర్తించే సిబ్బంది రెస్ట్‌రూమ్‌గా ప్రస్తుతం వినియోగిస్తున్నారు. అయితే ఈ క్వార్టర్స్ రాత్రి అయ్యిందంటే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. కొందరు వ్యక్తులు అక్కడకు చేరి మద్యం సేవిస్తున్నారు. పగటి పూట అయితే ధూమపానం చేసేందుకు పోలీస్ క్వార్టర్స్ నిలయంగా మారుతోంది. కొత్త పోలీస్ క్వార్టర్స్ నిర్మాణం ఎప్పుడు చేపడతారో సిబ్బంది వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.



క్వార్టర్స్ సమీపంలో ధూమపానం చేస్తున్న దృశ్యం

'చెత్త' డంపర్ బిన్‌లో వేయాలి

రంగారెడ్డినగర్: లక్షలాది జీహెచ్ఎంసీ నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన తడి, పొడి చెత్త డంపర్ బిన్‌లు నిరుపయోగంగా మారుతున్నాయి. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రోడ్ల వెంబడి సర్కిల్ అధికారులు చెత్తను డంప్ చేసేందుకు ఎరుపు, నీలం, పచ్చ రంగుల్లో డంపర్ బిన్‌లను ఏర్పాటు చేశారు. అయితే కొన్నింటిని ఇష్టానుసారంగా ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా మారుతున్నాయి.

◆ అవసరమున్న ప్రాంతాల్లో కాకుండా ఒకే వరుసలో పదుల సంఖ్యలో డంబర్ బిన్‌లను ఏర్పాటు చేసి ప్రభుత్వ ఖజానాను దుబారా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులోని నాలా సమీపంలో డంపర్ బిన్‌లు ఏర్పాటు చేయగా పక్కనే చెత్తను డంప్ చేస్తుండటం గమనార్హం. ఈ విషయమై అధికారులు కఠినంగా వ్యవహరించి డంపర్ బిన్‌లలోనే చెత్తను వేసేలా చర్యలు తీసుకోవాలి.



షాపూర్‌నగర్ ప్రధాన రోడ్డులోని నాలాను ఆనుకుని ఏర్పాటు చేసిన డంపర్ బిన్‌లు.. పక్కనే చెత్తాచెదారం

అత్యధిక పేటెంట్లలో జపాన్‌ది అగ్రస్థానం

'మనూ' లీగల్ స్టడీస్ ప్రొఫెసర్ తబ్రేజ్ అహ్మద్

రాయదుర్గం: సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం యొక్క పురోగతిని పేటెంట్ల పరంగా కొలుస్తారని మనూ లీగల్ స్టడీస్ ప్రొఫెసర్ తబ్రేజ్ అహ్మద్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో శుక్రవారం 'మేధో సంపత్తి- హక్కులు' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక పేటెంట్లతో జపాన్ అగ్రస్థానంలో ఉందని, చైనా ముందుకు దూసుకుపోతోందన్నారు. భారతదేశం తన పరిశోధనలను మరింత పటిష్ఠం చేయాలని సూచించారు. యూనివర్సిటీలు నాణ్యమైన పరిశోధనలను ప్రోత్సహించాలన్నారు. వీసీ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ నాణ్యమైన పరిశోధన అవసరమన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెడ్ డాక్టర్ సయ్యద్ నజీవుల్లా, ప్రొఫెసర్ కనీజ్ జెహ్రా, డాక్టర్ సుధాంశుచంద్ర ప్రసంగించారు.